


రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.34 (శుక్రవారం సాయంత్రం)
సహర్ : 4.51 (శనివారం ఉదయం)

బుద్ధి మంతుడు ఆత్మ నిగ్రహంతో ఉంటు పరలోకం కోసం సిద్ధం చేసుకుంటాడు. బలహీనుడు తన ప్రాపంచిక కోరికలు తీర్చుకుంటు కేవలం అల్లాహ్ యొక్క క్షమానలపై ఆశపడి ఉంటాడు.



మంత్రి పదవిపై.. ఆశలు!

- మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు
- ఈ నేపథ్యంలో మంత్రి పదవి నిజామాబాద్‌కా.. కామారెడ్డికా?
- క్యాబినెట్ విస్తరణపై మారుతున్న సామాజిక సమీకరణాలు
- ఉమ్మడి జిల్లాలో ఎవరికో ఒకరికి అమాత్యయోగం దక్కే అవకాశం
- రేసులో కామారెడ్డి జిల్లా నుంచి మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులు
- మైనార్టీ కోటాలో షబ్బీర్‌అలీ పేరు ప్రచారం
- ఢిల్లీపెద్దలతో మంత్రి పదవిపై లాబీయింగ్
- ఉగాది వరకు మంత్రివర్గ విస్తరణపై క్లారిటి

కామారెడ్డి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రి వర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్న విషయం తెలిసిందే. వీలైనంత త్వరగా నాలుగు లేదా ఆరు క్యాబినెట్ పదవులను భర్తీ చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంపై చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రెండో విడత మంత్రివర్గ విస్తరణలో కామారెడ్డి జిల్లాకు మంత్రి పదవి దక్కుతుందని రాజకీయ వర్గాల్లోనే కాకుండా జిల్లా ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. అయితే ఉమ్మడి జిల్లా నుంచి ఒకరికి మంత్రి పదవి రావడం ఖాయమని ఆ అమాత్యులు ఎవరనేదానిపైనే కాంగ్రెస్ వర్గాలతో చర్చ సాగుతోంది. అయితే మంత్రి పదవి నిజామాబాద్ జిల్లాకు కేటాయిస్తారా లేదా కామారెడ్డికి దక్కుతుందా అనేది త్వరలో క్లారిటీ రానుంది. నిజామాబాద్ జిల్లాలోనైతే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేరు చర్చకు వస్తుండగా కామారెడ్డి జిల్లాలో ముగ్గురు పేర్లు తెర మీదకు వస్తున్నాయి. సామాజిక సమీకరణాల నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కనుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలతో మంత్రి పదవి కోసం ఢిల్లీస్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్లు ఆ పార్టీలో చర్చ సాగుతోంది.

మారుతున్న సామాజిక సమీకరణాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తి చేసుకున్నా రెండో విడత మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నెలకొంటుంది. ఇప్పటికే మంత్రి వర్గ విస్తరణపై రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు అధిష్ఠానంతో పలుమార్లు చర్చలు జరిపినా వాయిదా పడుతూ వచ్చాయి. ఇటీవల మంత్రి వర్గ విస్తరణపై ఏఐసీసీ తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సామాజిక సమీకరణాల్లో ఆయా సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఏఐసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంత్రి రేసులో సుదర్శన్‌రెడ్డి పేరు జోరుగా ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి సైతం పట్టుబడుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే సామాజిక సమీకరణాల్లో భాగంగా రెడ్డి సామాజిక వర్గానికి నల్గొండ నుంచి ప్రాతినిధ్యం దక్కితే బోధన్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కే అవకాశం కష్టమేనని కాంగ్రెస్ వర్గాల్లో చర్చసాగుతోంది. ఈ నేపథ్యంలో కామారెడ్డి జిల్లా నుంచి ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల పేర్లు తెరమీదకు రావచ్చని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి పదవి కోసం తీవ్ర పోటి నెలకొంది. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందోనని ఏఐసీసీ ఎవరికి మంత్రి పదవి కట్టబెడుతుందో వేచి చూడాలి.

రేసులో మదన్‌మోహన్‌రావు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే భారీ మెజార్టీతో గెలుపొందిన మదన్‌మోహన్‌రావు మంత్రి వర్గంలో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి సారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి 24 వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. అయితే మొదటి విడత క్యాబినెట్‌లో మంత్రిగా తనకు అవకాశం ఇవ్వాలని మదన్‌మోహన్‌రావు ఆశించారు. కానీ చోటు దక్కలేదు. మదన్‌మోహన్‌రావుకు ఏఐసీసీ పెద్దలతో మంచి సత్సంబంధాలు ఉండడం, రెండో విడత మంత్రివర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి వస్తుందనే భావన అనుచర వర్గాల్లో కలుగుతోంది. అయితే వెల్మ సామాజిక వర్గం నుంచి మదన్‌మోహన్‌రావుతో పాటు మరో ఎమ్మెల్యే పోటీలో ఉన్నారు. అయితే సదరు ఎమ్మెల్యే జిల్లాలో ఎస్సీ నేతకు మంత్రి పదవి దాదాపు ఖరారు కావడంతో మదన్‌మోహన్‌రావుకు అమాత్య పదవి దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మదన్‌మోహన్‌రావు మంత్రి పదవి కోసం ఢిల్లీలోనే మకాం వేసి ఏఐసీసీ పెద్దలను కలుస్తున్నారని ఆయన అనుచర వర్గం చెబుతోంది.

ప్రభుత్వ సలహాదారు పదవితో సంతృప్తిగా లేని షబ్బీర్

కాంగ్రెస్‌లో ఉమ్మడి నిజామాబాద్ నుంచి సీనియర్ నాయకుడైన మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి షబ్బీర్‌అలీ ఓటమి పాలయ్యారు. అయితే కాంగ్రెస్ షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవిని కట్టబెట్టినప్పటికీ దాంతో ఆయన అసంతృప్తితోనే ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కుతుందని షబ్బీర్‌అలీ ఆయన అనుచర వర్గం భావించినా చివరకు అధిష్ఠానం ఎమ్మెల్సీ అవకాశాన్ని ఇవ్వలేకపోయింది. దీంతో మంత్రి పదవిపై షబ్బీర్‌అలీ ఆశలు దాదాపు నీరుగారాయి. అయితే ఏఐసీసీ మంత్రి వర్గ విస్తరణలో సామాజిక వర్గాల వారీగా పదవులు ఇవ్వాలని భావిస్తుండడం అందులో ఓ మైనార్టీ నేతకు మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం సాగు తోంది. ఈ నేపథ్యంలో మంత్రి పదవి కోసమై షబ్బీర్‌అలీ ఏఐసీసీ పెద్దలతో తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. ఇటీవల పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసినట్లు సమాచారం.

ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్

ఉగాది కల్లా మంత్రి వర్గ విస్తరణ కాంగ్రెస్ అధిష్ఠానం చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి పదవిని ఆశిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఏఐసీసీలో వీరు ఇరువురికి ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుందని గంటాపదంగా చెబుతున్నారు. అయితే మంత్రి పదవి కోసం ఎవరికి వారే పెద్ద మొత్తంలోనే లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఢిల్లీలో మకాం వేసి మంత్రి పదవి కోసం ఏఐసీసీ నేతలను కాకా పడుతున్నట్లు తెలిసింది.

పది పరీక్ష ప్రశ్నల లీకేజీలో 11 మందిపై కేసు

- 8 మందిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలింపు
- పరారీలో మరో ముగ్గురు..
- ఇందులో నలుగురు వెబ్ పేపర్, యూట్యూబ్ ఛానళ్ల రిపోర్టర్లు
- వీరిని సైతం త్వరలోనే అరెస్టు చేస్తాం
- ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్‌చంద్ర



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : జుక్కల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రం నుంచి మ్యాథ్స్ ప్రశ్నా పత్రంలోని కొన్ని ప్రశ్నలు లీక్ అయిన కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. పదో తరగతి ప్రశ్న పత్రంలోని పలు ప్రశ్నలు బయటకు రావడం.. వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేసిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఇందులో నలుగురు వెబ్‌పేపర్, యూట్యూబ్ ఛానళ్ల రిపోర్టర్‌లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా మరో ముగ్గురు మైనర్లు ఉన్నారన్నారు. ఈ మేరకు గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థి బుధవారం జరిగిన మ్యాథ్స్ పరీక్ష పాస్ అయ్యేందుకు తన తండ్రి జాదవ్ సంజయ్‌ను సహాయం కోరాడు. దీంతో జాదవ్ సంజయ్ అదే పాఠశాలలో పని చేస్తున్న ప్రైవేట్ వాటర్‌మెన్ సయ్యద్ ముబీన్ ద్వారా ఓ తెల్లకాగితంపై ప్రశ్నపత్రంలోని కొన్ని ప్రశ్నలను రాయించుకుని వచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. సంజయ్ చెప్పినట్లుగా వాటర్‌మెన్ తెల్ల కాగితాన్ని తీసుకెళ్లి 5 ప్రశ్నలు (సీరియల్ నెంబర్ 13 నుంచి 17 వరకు) రాయించుకుని బయటకు వచ్చి సంజయ్‌కు అప్పగించాడు. అయితే అతని వద్ద నుంచి మనోజ్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లో కాగితం ఫొటోలు తీసి బతుకమ్మ డిజిటల్ మీడియాకు చెందిన హన్మాండ్లుకు పంపగా.. అతను తన వాట్సాప్ ద్వారా కేబీ-9 యూట్యూబ్ ఛానల్‌కు చెందిన భానుకు పంపాడు. భాను దాన్ని మన దినపత్రిక - యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు గంగాధర్‌కు పంపాడు. ఈ క్రమంలోనే ప్రశ్నల లీకేజీకి సంబంధించి గంగాధర్ ఒక క్లిప్‌ను తయారు చేసి స్థానికంగా ఉన్న వాట్సప్ గ్రూప్‌లలో వైరల్ చేశాడు. ఇదే సమయంలో వరప్రసాద్ అనే మరోవ్యక్తి ఓ మైనర్ సహాయంతో మరో మైనర్ వద్ద నుంచి ప్రశ్నపత్రం ఫొటో తీసుకుని మనోజ్‌కు పోస్టు చేసి.. కొద్ది సమయంలోనే దాన్ని మొబైల్ నుంచి తొలగించాడు. ప్రశ్నల లీక్‌కు సంబంధించి విద్యాశాఖ నుంచి ఫిర్యాదు రాగానే బాన్సువాడ డీఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకొని తన బృందంతో దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ప్రశ్నల లీక్‌కు కారణమైన, సోషల్ మీడియాలో వైరల్ చేసిన 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. అలాగే భాను అనే వ్యక్తి, జనంసాక్షి రిపోర్టర్, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ నయీంతో పాటు వాట్సాప్‌లో ప్రశ్నపత్రం వైరల్ చేసిన మరో మైనర్ వ్యక్తి పరారీలో ఉన్నారన్నారు. వీరిని సైతం త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఉన్న పోలీసు శాఖ సిబ్బందిపై సైతం పూర్తిస్థాయిలో విచారణ జరిపి.. క్రమశిక్షణ చర్యల కింద చర్యలు తీసుకుంటామన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి తోసేలా ఇలాంటి చర్యలు చేపట్టవద్దని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ నరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నల లీకేజీ ఘటనలో ఎవరినీ ఉపేక్షించేది లేదు

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు



పెద్ద కొడప్‌గల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన 10వ తరగతి గణిత ప్రశ్నలు లీకేజీ ఘటనలో బాధ్యులు ఎంతటి స్థాయిలో ఉన్నా ఉపేక్షించేది లేదని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రశ్నల లీకేజీ ఘటనలో ఇప్పటికే అధికారులు విచారణ చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 10వ తరగతి ప్రశ్నలు బయటకు లీకేజీ కావడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఈ ఘటనలో జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఉందని, తమ ప్రభుత్వం విద్యా పటిష్ఠత కోసం అనేక చర్యలు తీసుకుంటున్నది తెలిపారు. ఇంకా ప్రశ్నల లీకేజీ ఘటనలో మిగిలిన బాధ్యులపై రానున్న రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనలో ఎంతటి వారైనా శిక్షార్హులేనని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు మిగిలిన పరీక్షలు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు.

మున్సిపల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్‌లో పని చేస్తున్న 12 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న 12మందిని జనవరి 22న ఎటువంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించడం అన్యాయమని అన్నారు. రాజకీయ నాయకుల విధానాల వల్ల కార్మికులను విధుల నుంచి తొలగించి వారి కుటుంబాలను అన్యాయం అయ్యేటట్టు చేశారని తెలిపారు. ఈఎస్ఐసీ, ఈపీఎఫ్ ఉన్నటు వంటి కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. లేకపోతే మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయపాల్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నీటి సరఫరా పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బీర్కూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో గురువారం అస్తవ్యస్తంగా ప్రత్యేక పాలన శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం అయింది. బుధవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ కార్యక్రమంలో భాగంగా బీర్కూర్‌లోని ఆయా కాలనీలను సందర్శించి సమస్యలను గుర్తించింది. అధికారుల ప్రత్యేక పాలన వల్ల గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టింది. ఈ కథనానికి అధికారులు వెంటనే స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గురువారం ఎంపీడీవో భానుప్రకాష్, ఎంపీవో మహబూబ్, గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సెక్రెటరీ ప్రవీణ్‌లు గ్రామంలోని ఆయా కాలనీల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చేత కూరుకుపోయిన మురికి కాలువలను శుభ్రం చేయించారు. ఆయా కాలనీల్లోని డ్రైనేజీ చెత్తా చెదారంతో నిండిపోయి కంపు కొడుతు న్నాయి. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. అయితే అధికారులు ఆయా కాలనీల్లో పారిశుధ్యం కార్మికులతో డ్రైనేజీలు క్లీన్ చేయించారు. ఇక తాగునీటి సమస్య విషయంలో కుళాయిలకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు. నిరుపయోగంగా మారిన మిషన్ భగీరథ కుళాయిలను పునరుద్ధరించారు. దీంతో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుంది. స్థానిక ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బీర్కూర్‌లో మురికి కాలువను శుభ్రం చేయిస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో నల్లా నీరు సరఫరా అవుతున్న దృశ్యం)

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సాటాపూర్‌లో విద్యార్థుల చదువును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రెంజల్,మార్చి27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బోధన తీరును మెరుగుపర్చి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్య విధానంతో పాటు ఫలితాలను మెరుగుపర్చాలన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన తీరుతో మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు గణితం, తెలుగుపై సందేహాలను నివృత్తి చేశారు. ఆయన వెంట ఆర్‌ఐ రవి కుమార్, ఉపాధ్యాయులు గంగారాం, శ్రీనివాస్ రెడ్డి, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం

బోధన్‌రూరల్,మార్చి27(ఆంధ్రజ్యోతి): బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోను గురువారం బోధన్ ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన మేనేజర్ బీ.విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులు, ఆర్థిక లావాదేవీలు, బస్సుల స్థితిగతుల గురించి ఆర్టీసీ డీఎంను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆర్టీసీ డీఎం బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

● అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలించవద్దు

ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం మాత్రమే ట్రాక్టర్‌లలో ఇసుక రవాణా చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం బోధన్ మండలంలోని సిద్దాపూర్, ఖండ్‌గావ్ క్వారీలను పరిశీలించారు. అటు వైపుగా వెళ్తున్న ఇసుక టిప్పర్లను, ట్రాక్టర్లను ఆపి వేబిల్లులను పరిశీలించారు. ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించాలని వేబిల్లులు లేకుండా అధిక లోడ్‌తో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ విఠల్‌తో పాటు తదితరులున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి



కోటగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్థులు

కోటగిరి,మార్చి27(ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగాపూర్ శివారులో అడ్కాస్ లింగమయ్య ఆలయ సమీపంలో ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని లింగాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కోటగిరి తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆలయ సమీపంలో 36సర్వే నెంబర్‌లో 13ఎకరాల 30గుంటల ప్రభుత్వ భూమి ఉందన్నారు.ఈ భూమిని కొందరు కబ్జా చేసి పంట సాగు చేస్తున్నారని తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వేజరిపి ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ మాజీ సర్పంచ్ హన్మంతు, నాయకులు పండిత్ రావు, భీంరావు, రాములు, శ్రీధర్,సైదయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో ఇసుక పాయింట్ పరిశీలన



నాళేశ్వర్‌లో ఇసుక వాగును పరిశీలిస్తున్న అధికారులు

నవీపేట,మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్, నిజాంపూర్‌లలో గురువారం ఇసుక పాయింట్‌ను అధికారులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర ప్రభుత్వ పనుల కోసం సంబంధిత ఇసుక పాయింట్‌ను పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు. తమ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఏడీ మైన్స్ విజయ్ కుమార్, ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము తదితరులు పాల్గొన్నారు.

బోధన్ మున్సిపల్ చైర్మన్ సీటును కైవసం చేసుకుంటాం

● మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, మార్చి27(ఆంధ్రజ్యోతి): వచ్చే సంస్థాగత ఎన్నికలలో, మున్సిపల్ ఎన్నికలలో బోధన్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని అందుకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. గురువారం ఉదయం పాత బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సంద్భంగా పలువురు ఎంఐఎం నేతలు అతనిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ ఎంఐఎం పార్టీని బలోపేతం చేస్తూ ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుండి ఎంఐఎం పార్టీలో చేరిన మహ్మద్ ఇలియాస్ బోధన్‌లో చురుకైన పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హంగర్గలో కంకర లారీ బోల్తా

కోటగిరి,మార్చి27(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ ఆబాది సమీపంలో గురువారం అదుపు తప్పి కంకర లారీ బోల్తా పడింది. హంగర్గ గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి హైదరాబాద్ నుంచి కంకర లోడ్‌తో లారీ రాగా గ్రామ సమీపంలో బోల్తా పడింది. కంకరను ఖాళీ చేసే క్రమంలో లారీని వెనుకకు తీసుకుంటుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానం

భీమ్‌గల్‌రూరల్, మార్చి27(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్సై మహేష్ అన్నారు. గురువారం మండలంలోని ముచ్కూర్ గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాల నియంత్రిణకై సీసీ కెమెరాలు దోహదపడతాయని నేరాలకుపాల్పడినవారిని వెంటనే గుర్తించి శిక్ష పడేల చేయవచ్చని మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

● రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



నవీపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్

నవీపేట,మార్చి27(ఆంధ్రజ్యోతి):రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతీ ఒక్కరిపై బాధ్యత ఉందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఆ రోజుల్లో జాతీయ నాయకులు పోరాటం చేశారని బీఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసం ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. వచ్చే నెల 3నుంచి గ్రామగ్రామాన సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని పేర్కొంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సంగెం శ్రీనివాస్, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అర్గుల్‌లో ఇఫ్తార్‌విందులో తాహెర్‌బిన్ హందాన్

జక్రాన్‌పల్లి,మార్చి27(ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసం పండగ సందర్భంగా మండలంలోని అర్గుల్ గ్రామంలో మాజీ జిల్లా సర్పంచ్‌ల ఫోరం సంఘం అధ్యక్షుడు గోర్తె రాజేంధర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉర్దూఅకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ పాల్గొన్నారు. ముస్లీం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లీంలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, మాజీసర్పంచ్ పద్మ, నిజామాబాద్‌రూరల్ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, మాజీఎంపీటీసీ మద్దుల రమేష్, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, ముస్లీంలు పాల్గొన్నారు.

బోగస్ రైతులతో బోనస్ స్వాహా

● కోటగిరి సహకార సంఘంలో రూ.25లక్షలకు పైగా అవినీతి
● రికవరీ చేయాలని బీజేపీ నాయకుల డిమాండ్



కోటగిరిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోటగిరి,మార్చి27(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సన్నరకం ధాన్యం పండించిన రైతులకు అందని బోనస్ బోగస్ రైతులకు అందించిన ఘనత కోటగిరి సహకార సంఘంలో చోటు చేసుకుందని బీజేపీ నాయకులు విమర్శించారు. సహకార సంఘంలో బోగస్ రైతులతో సుమారు 20లక్షల రూపాయలు బోనస్ స్వాహా చేసినట్లు బీజేపీ నాయకులు ఆరోపించారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం సొసైటీ అవినీతి, అక్రమాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోటగిరి సహకార సంఘంలో గత ఖరీఫ్ సీజన్‌లో 618మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే సమయానికే రైతులు పెద్ద మొత్తంలో బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయించుకున్నారు. 75శాతానికి పైగా ధాన్యం బహిరంగ మార్కెట్‌లో రైతులు విక్రయించుకున్నారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పడంతో కోటగిరి సహకార సంఘం పాలకవర్గం బోనస్ డబ్బులను స్వాహా చేసేందుకు ప్రయత్నించిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. రైతులకు రావాల్సిన బోనస్ సొసైటీ చైర్మన్, రైస్ మిల్లర్లు, కాంట్రాక్టర్లు బోగస్ పేర్లతో దోచుకున్నారని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తులకు వడ్లు అమ్ముకున్న రైతుల పేర్లతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మినట్లు రికార్డులు సృష్టించి సుమారు 20లక్షల రూపాయల బోనస్ డబ్బులు బోగస్ రైతుల ఖాతాల్లో వేసినట్లు బీజేపీ నాయకులు పూర్తి వివరాలతో వెల్లడించారు. సొసైటీ చైర్మన్ కూచి శ్రీనివాస్ తన భార్య పేరు మీద రూ.1.60లక్షల, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ 2.83లక్షల రూపాయలు, కోటగిరికి సంబంధం లేని వ్యక్తి శ్రావణ్ అనే రైతు ఖాతాలో 2.10లక్షల రూపాయలు, శ్రీకాంత్ అనే వ్యక్తి ఖాతాలో 1.35లక్షలు, గాండ్ల శ్రీనివాస్ ఖాతాలో 3.05లక్షలు, ఎండీ ఇస్మాయిల్ అనే వ్యక్తి ఖాతాలో 6.55లక్షల రూపాయలు, ఓ రైస్‌మిల్లు యాజమాని ఖాతాల్లో 1.82లక్షల రూపాయల బోనస్ డబ్బులు వచ్చాయని బీజేపీ నాయకులు వెల్లడించారు. అసలు వ్యవసాయమే చేయని వారి ఖాతాల్లో సైతం బోనస్ డబ్బులు జమ చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ అవినీతి, అక్రమాలలో చైర్మన్‌తో పాటు విండో కార్యదర్శి, వ్యవసాయ అధికారుల పాత్ర ఉన్నట్లు బీజేపీ నాయకులు ఆరోపించారు. గత సీజన్‌లో అకాల వర్షాలు పడడంతో రైతులు హడావిడిగా ధాన్యం ప్రైవేటు వ్యక్తులకు అమ్మినట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని సొసైటీ చైర్మన్ తనతో పాటు తన అనుచరులకు లబ్ది చేకూర్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై చైర్మన్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.అవకతవకలకు పాల్పడడంలో కోటగిరికి చెందిన జీఎంకే ట్రేడర్స్, శ్రీ సాయి ఆగ్రో, ఓంసాయి రైస్‌మిల్లు, ఎస్‌ఏ ట్రేడర్స్ రైస్ మిల్లులు సహకరించాయని ఆరోపించారు. బోగస్ పేర్లతో బోనస్ పొందిన రైతుల నుంచి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు నిధులను రికవరీ చేసి సహకార సంఘంలో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నవీన్, నాయకులు మోహన్ రావు, శ్యామల, గజేందర్, కాశీరాం, శ్రీనివాస్, హొగిర్‌రావు దేశాయ్, పత్తి సతీష్ రుద్ర నాగరాజు, గంగాధర్, రమణ, రహీం తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించాలి



పొతంగల్‌లో మాట్లాడుతున్న విండో ప్రత్యేక అధికారి రియాజుద్దీన్

కోటగిరి,మార్చి27(ఆంధ్రజ్యోతి): పొతంగల్ సహకార సంఘంలో ఇంటర్నల్ ఆడిట్ నిర్వహిస్తేనే అవినీతి, అక్రమాలు బయటకు వస్తాయని సంఘ సభ్యులు పేర్కొన్నారు. పొతంగల్ విశాల పరపతి సంఘం 90వ మహజన సభ ప్రత్యేక అధికారి రియాజుద్దీన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సంఘంలో వార్షిక లావాదేవీలను సభ్యులకు వివరించారు. గతంలో సహకార సంఘం సెక్షన్ 51ప్రకారం విచారణ జరిపిన కేవలం 55లక్షలు మాత్రమే అవినీతి జరిగినట్లు విచారణ అధికారులు వెల్లడించారు. సంఘంలో పెద్ద మొత్తంలో అవినీతి చోటు చేసుకుందని సమగ్ర విచారణ జరిపితే అవినీతి, అక్రమాలు బయటకు వస్తాయని సభ్యులు కోరారు. అవినీతి, అక్రమాలను వెలికి తీసేందుకు 9మందితో కూడిన ప్రత్యేక కమిటీతో పాటు మరో ముగ్గురితో ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించేందుకు సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇంటర్నల్ ఆడిట్‌తో సంఘంలోని అన్ని లావాదేవీలపై విచారణ జరిపి నష్టానికి కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్ రావు, సీఈవో శివాజీ, సంఘ సభ్యులు పవన్, దిలీప్ కుమార్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపల్లిలో రసాభాస

కోటగిరి మండలంలోని కొత్తపల్లి సహకార సంఘం మహజన సభ గురువారం అధ్యక్షులు సునీల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. మహజన సభలో రసాభాస కొనసాగింది. కొత్తపల్లి సంఘం రైస్‌మిల్లు ప్రహారి గోడ నిర్మించేందుకు గత సంవత్సరం తీర్మానించిన ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. రైస్‌మిల్లుకు భద్రత లేకుండా పోయిందని కొత్తపల్లి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. లింగాపూర్ గ్రామంలో గోదాం నిర్మించాలని తీర్మానం చేసిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపల్లి సొసైటీ పరిధిలో లింగాపూర్‌కు 1860ఎకరాల శివారులో ఉండగా గోదాం నిర్మించకపోవడంతో అంతర్యమేమిటని ప్రశ్నించారు. 500ఎకరాలు ఉన్న గ్రామాల్లో గోదాములు నిర్మిస్తూ తమ గ్రామంపై నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ విషయంలో చైర్మన్ తీరును నిరసిస్తూ లింగాపూర్ గ్రామస్థులు బహిష్కరించారు. సంఘంలో ఒక్కరికి కూడా సభ్యత్వం ఇవ్వకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తంచేశారు.

● నవీపేట సొసైటీ మహజన సభ

నవీపేట: నవీపేట సొసైటీ మహజన సభను గురువారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. 2024-25 అర్ధవార్షిక నివేదికను సొసైటీ కార్యదర్శి మహేష్ సభ్యులకు చదివి వినిపించారు. ఫత్తేనగర్, దర్యాపూర్‌లలో నూతనంగా గోదాములు నిర్మించాలని, 2లక్షల వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు గోపి, కాంతం రెడ్డి, రాము, బాల గంగాధర్, శ్రీనివాస్, గౌతం, గణేష్, సాయిబాబా తదితరులున్నారు.

● బకాయిలు వసూలు చేయాలని కోరుతూ డైరెక్టర్ నిరసన

గతంలో నవీపేట సొసైటీలో పలువురు సభ్యులకు అనామతుగా ఇచ్చిన ఎరువుల బకాయిలను వెంటనే వసూలు చేయాలని కోరుతూ సొసైటీ డైరెక్టర్ బాల గంగాధర్ మహజన సభలో నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. గతంలో సుమారు రూ.22లక్షల వ్యయం గల ఎరువులను పలువురికి అనమాతుగా ఇచ్చారని సంబంధిత డబ్బులను వెంటనే వారి నుండి రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్నిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌విందులో కాసులబాల్‌రాజ్,భాస్కర్‌రెడ్డి

వర్ని,మార్చి27(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో బుధవారం రాత్రి ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు,ఉమ్మడి జిల్లాల మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, తహసీల్దార్ సాయిలుతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ భారీ, నామాల సాయిబాబు, ఘన్‌పూర్ సాయిలు, శానం సాయిలు, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, సరిన్, అక్తర్‌తో పాటు నియోజకవర్గ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడిన నిందితుడి పట్టివేత

నవీపేట,మార్చి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫత్తేనగర్ శివారులో గురువారం బోర్ల వద్ద కేబుల్ వైర్లను కోసుకుని వెళ్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గతకొంతకాలంగా బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయని పలువురు రైతులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బోర్ల వద్ద కేబుల్ వైర్లను చోరీ చేస్తున్న నిందితుడు మైనర్‌గా భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముప్కాల్, మార్చి27(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని బస్సాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు దాడుతుండగా ముప్కాల్ వైపు నుంచి బాల్కొండ వైపు వస్తున్న డీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. 40నుంచి 45ఏళ్ళ గల గుర్తుతెలియని వ్యక్తి టీషర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిస్తే బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

నేడు బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యగ్రహ దీక్ష

జక్రాన్‌పల్లి, మార్చి27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీజేపీ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ భవనం వద్ద ధర్నాచౌక్ దగ్గర రైతు సత్యగ్రహ దీక్షను నిర్వహిస్తున్నట్లు బీజేపీ కిషన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ పసుపు బోర్డు అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యపాల్గొంటారని ఆయన తెలిపారు.

ప్రాణం తీసిన కారు 'పంచాయితీ'!

● ఈఎంఐ సరిగ్గా కట్టని కొనుగోలు చేసిన వ్యక్తి
● తన కారు తాను తీసుకెళ్లే క్రమంలో రమేష్‌పై ఇటుకబట్టీ కార్మికుల దాడి
● దొంగగా భావించి చెట్టుకు కట్టేసి కొట్టిన వైనం.. అక్కడిక్కడే మృతి



రమేష్ (ఫైల్)

దోమకొండ,మార్చి 27(ఆంధ్రజ్యోతి):కారు ఈఎంఐ పంచాయితీ.. నిండు ప్రాణాన్ని బలిగొంది. కారు అమ్మిన విషయంలో కొన్న వ్యక్తి కొన్ని డబ్బులు చెల్లించగా.. మిగతా డబ్బుల విషయంలో జరిగిన గొడవలో కారు అమ్మిన వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన ఈరబోయిన రమేష్ (35).. చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె పోచయ్యకు కొద్ది రోజుల క్రితం తన స్విఫ్ట్ కారును విక్రయించాడు. కారు అమ్మిన సమయంలో కొంత మొత్తం డబ్బు చెల్లించగా.. మిగతా డబ్బుతో పాటు ఈఎంఐ కూడా ప్రతీ నెల చెల్లిస్తానని ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. అయితే రమేష్‌కు పోచయ్య సరైన సమయంలో డబ్బులు ఇవ్వకపోగా.. ప్రతీరోజు చుట్టూ తిప్పించుకుంటున్నాడు. పైగా కారుపై ఉన్న లోన్‌ను కూడా ప్రతీ నెల సరిగ్గా కట్టడం లేదు. దీంతో ఫైనాన్స్ సిబ్బంది లోన్ కట్టాలంటూ రమేష్‌కు ఫోన్ చేసి వేధించసాగారు. ఈ విషయమై బుధవారం పోచయ్య ఇంటికి వెళ్లి ప్రశ్నిస్తే.. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన రమేష్ తాను విక్రయించిన కారుకు సంబంధించిన మరో తాళం చెవిని తీసుకుని గురువారం తెల్లవారుజామున చింతమాన్‌పల్లి గ్రామ శివారులో పోచయ్య నిర్వహిస్తున్న ఇటుకబట్టీ వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న తన కారును తీసుకెళ్లేందుకు రమేష్ ప్రయత్నిస్తుండగా.. అక్కడే నిద్రిస్తున్న పోచయ్య మీదకి వాహనం అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పోచయ్య గాయాలు కావడంతో.. అతను కేకలు వేయగా ఇటుకబట్టీలోని కార్మికులు రమేష్‌ను పట్టుకొని దాడికి పాల్పడ్డారు. కార్మికులు రమేష్ కారును దొంగలిస్తున్నాడని భావించి.. చెట్టుకు కట్టేసి విచక్షణరహితంగా కర్రలతో దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోచయ్య పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన రమేష్‌ను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మృతుడి కుటుంబీకులు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం
ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి: బోధన్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,మార్చి27(ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ విషయమై జీరో అవర్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ మూతబడడానికి గల కారణాలు వివరిస్తూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి సహకరించాలని కోరారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ 1937లో ప్రారంభించబడిందని ఆ రోజుల్లో నిజాం సర్కార్ 60వేల ఎకరాలలో చెరకు పండించి రైతులకు సూచనలు ఇస్తూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. 87సంవత్సరాల తర్వాత 10సంవత్సరాల క్రితం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ మూత పడిందన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించడానికి ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. అప్పటి షుగర్స్ ఫ్యాక్టరీలో మోలాసిస్, బగాస్‌తో నడిపిస్తూ విత్తనాలు కూడా తయారు చేసే వారన్నారు. 20సంవత్సరాల వరకు చెరకు వేయడానికి మంచి విత్తనాలు పంపడంతో ఇక్కడ రైతన్నలు చెరకును పండించే వారన్నారు. అనేక లాభాలు ఉన్న ఫ్యాక్టరీ గత ప్రభుత్వం మూలంగా మూత పడిందన్నారు. జిల్లా కోడలు అయిన ఎమ్మెల్సీ కవిత సొంత నియోజకవర్గమైన ఫ్యాక్టరీ ప్రారంభించడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెరిపిస్తాడు అనుకున్నాం. దానికి భిన్నంగా వారు ఫ్యాక్టరీని మూసివేయించారని ఆరోపించారు. నష్టాలను చూపిస్తూ కార్మికులు, కర్షకుల కడుపులు కొట్టారన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో 20మెగా వాట్ల పవర్ ప్లాంట్‌తో నడిచే ఫ్యాక్టరీని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మూసి వేయించారన్నారు. సంబంధిత శాఖ మంత్రులతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు ఫ్యాక్టరీ కొత్తగా తెరిపించడానికి అనుమతులు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షులుగా ఉన్నప్పుడు జయపాల్ రెడ్డితో కలిసి తెలంగాణలో ఒక మంచి ఫ్యాక్టరీని అభివృద్ధి చేయాలనే సంకల్పం చేశామన్నారు. కొత్త ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ఎంతో టెక్నాలజీతో వచ్చిన మెషిన్లతో ఫ్యాక్టరీని ప్రారంభించడానికి సహకారం అందించాలన్నారు. ఫ్యాక్టరీలో విత్తనాలు సైతం తయారు చేస్తామని, చెరకు పిప్పి కూడా అనేక రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. కావున ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి బోధన్‌లో ఫ్యాక్టరీ తెరిపించడానికి సంబంధిత మంత్రులు, అధికారులు అందరు సహకరించాలన్నారు.

రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



అసెంబ్లీ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్,మార్చి27(ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురు వారం శాసన సభలో మాట్లాడుతూ ఉగాది పండగ నుంచి రేషన్‌దుకాణాల్లో సన్నబియ్యం అందజేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిందని, బియ్యం అక్రమంగా మహారాష్ట్రకు ఎగుమతి కాకుండా చూడాలని అన్నారు. గతంలో నిజామాబాద్‌కు చెందిన ఒక శాసన సభ్యుడు కూడా రేషన్ బియ్యాన్ని అమ్ముకున్నారని, ఇలా రేషన్‌బియ్యం పేదవాడికి తక్కువగా అక్రమ రవాణాదారులకు ఎక్కువగా ఉపయోగపడుతుందని, దీన్ని ప్రభుత్వం నివారించాలని కోరారు. ఈ విషయమై సీనియర్ మంత్రులతో కమిటీ వేసి అక్రమ బియ్యం రవాణా జరగకుండా అడ్డుకట్టా వేయాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి కోరారు. అదే విధంగా అర్హులకు మాత్రమే రేషన్‌కార్డులు ఇవ్వాలని,అనర్హులకు తక్షణమే తొలగించాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

వేల్పూర్ పీహెచ్‌సీలో అమ్మఒడి



వేల్పూర్ పీహెచ్‌సీలో..

వేల్పూర్, మార్చి27 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌వీణ మాటాడుతూ ప్రతీ గురు వారం అమ్మఒడి కార్యక్రమం జరుగుతుందని అందులో గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు చేయ డం జరుగుతుందన్నారు. ప్రతీ గర్భిణీ స్త్రీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచ నలు తెలుపడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు చేయించుకోవాలని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున వృద్ధులు, పిల్లలు, గర్భవతుల పట్ల కుటుంబసభ్యులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు మహేష్, ల్యాబ్ టెక్ని షియన్ వేణు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

భీమ్‌గల్,మార్చి27(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై మహేష్ తెలిపారు. గురువారం ఉదయం వాహన తనిఖీలునిర్వహిస్తుండగా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్ గంగారావు, లింబాద్రిని అనుమతి పత్రాలను అడగగా ఎలాంటివి చూపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

నవీపేట: మండంలోని నాళేశ్వర్‌లో గురువారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. స్థానిక వాగు నుండి గ్రామం వైపు ఇసుకను ట్రాక్టర్‌లలో తరలిస్తుండగా ముందస్తుగా సమాచారం మేరకు సంబంధిత ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేసన్‌కు తరలించడం జరిగిందని అన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఇంటిని కూల్చివేసిన కేసులో మరో ముగ్గురి రిమాండ్

వేల్పూర్, మార్చి27(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామానికి చెందిన బచ్చు గంగాధర్ ఇంటిని ఈనెల 25న ట్రాక్టర్ బ్లేడ్‌తో కూల్చివేయగా గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గురువారం ముగ్గురు నిందితులు రిక్క ఆనందం, గుడెలిల ముత్తెన్న, తోపారం రామదాసులను రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బచ్చు గంగాధర్ అక్రమంగా ఇళ్లు నిర్మించడన్నా ఆరోపణతో గ్రామస్థులు ఆ ఇంటిని కూల్చివేసిన రోజే ట్రాక్టరను ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపిన విషయం విధితమే. మిగతా వారు పరారీలో ఉండగా గురువారం ముగ్గురిని కోర్టుకు పంపడం జరిగిందన్నారు. ఫిర్యాదు దారుడు బచ్చు, గంగాధర్ ఆయన భార్య పేరు మీద ప్రభుత్వం నుంచి పట్టాను పొంది అందులో లోపల సిమెంట్ రేకులతో ఇళ్లు నిర్మించుకొని కొన్ని ఏళ్లుగా జీవనాన్ని సాగిస్తున్నాడు. అందువల్ల అతను నివాసిస్తున్న ఇంటిని కూల్చివేయడం హేయమైన చర్య అన్నారు. అన్ని గ్రామ కమిటీలు గ్రామాభివృద్ధికి పాటుపడాలని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చట్టవ్యతిరేకమైన పనులు చేయకుండా ఉండాలని ఎస్సై హెచ్చరించారు.

రాయితీ పనిముట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి,మార్చి27(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలో రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లకు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోటగిరి వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో మహిళ రైతులకు 50శాతం, సాధారణ కేటగిరిలో మహిళ రైతులకు 40శాతం రాయితీపై పనిముట్లు సబ్సిడీపై అందిస్తామన్నారు. అవసరమైన రైతులు ఈ నెల 29వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏవో సూచించారు.

కేశ్‌పల్లిలో చలివేంద్రం ప్రారంభం

జక్రాన్‌పల్లి,మార్చి27(ఆంధ్రజ్యోతి):మండలంలోని కేశ్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం అధికారులు ప్రారంభించారు.ఈకార్యక్రమంలో మాజీసర్పంచ్ సాయికుమార్, మాజీఉప సర్పంచ్ భాస్కర్‌గౌడ్, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

ఫేటా..ఫేట్...

మొరం అక్రమంగా తరలిస్తే కేసులు తప్పవు

● శ్రీధర్ తహసీల్దార్, ముప్కాల్



ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు మొరం కోసం ఎన్ని అనుమతులు ఇచ్చారు?

తహసీల్దార్: గత ఏడాదిన్నర నుంచి మొరం కోసం ఒక్క అనుమతి కూడా ఇవ్వలేదు.

ఆంధ్రజ్యోతి: అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: ఏమైనా అక్రమంగా మొరం తరలిస్తున్న ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే కేసులు పెడతాం. బాల్కొండ పరిసర ప్రాంతాల్లో గుట్టలు తవ్వకుండా కందకలను తవ్వించాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ స్థలాల్లో కబ్జాలపైఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

తహసీల్దార్: బాల్కొండలో గల 1333 సర్వే నెంబర్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వారి సిబ్బంది వచ్చి సర్వే నెంబర్ ఎక్కడ నుంచి ఎక్కడి వరకు ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించారు. హద్దులను సీసీ ఫోల్ ద్వారా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ఏవరు కబ్జా చేసి కబ్జాలకు తావు లేకుండా తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఆయా గ్రామాల్లో కబ్జాలకు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

తహసీల్దార్: మండలంలోని ప్రతీ గ్రామంలో ప్రభుత్వ స్థల కబ్జాలు జరుగకుండా సంబంధిత అధికారుల ద్వారా పర్యవేక్షిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: భూముల రిజిస్ట్రేషన్ ఏలా జరుగుతుంది?

తహసీల్దార్: ప్రస్తుతం రోజుకు రెండు మూడు చొప్పున రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: కొత్త రేషన్‌కార్డులకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: మండలంలో కొత్త రేషన్‌కార్డులకు 3100దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల నుంచి పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసిన జలాల్‌పూర్ గ్రామానికి 25రేషన్‌కార్డులు మంజూరయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, ముప్కాల్)

ప్రభుత్వ ఆదాయ శాఖపై చిన్న చూపెందుకు..!?

● సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం
● ఉన్నవారితోనే ఊడిగం
● నత్తనడకగా రిజిస్ట్రేషన్లు

ఖిల్లా, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ శాఖల్లోనే అత్యధికంగా ప్రతీ రోజు కోట్ల రూపాయల ఆదాయం సమకూర్చే ఆ శాఖపై ప్రభుత్వానికి చిన్నచూపు కలుగుతుంది. సిబ్బంది నియామకంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల ఆ శాఖలో విధులు నిర్వహించడానికి కింది స్థాయితో పనులు చేయించుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రిజిస్ట్రేషన్ శాఖలో గత మూడు వారాలుగా సబ్‌రిజిస్ట్రార్లు లేక వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నెల 3న పూర్తి స్థాయి సబ్‌రిజిస్ట్రార్ అవి నీతి నిరోదక శాఖాధికారులకు పదివేలు లంచం తీసుకుంటూ పట్టుబడడంతో అప్పటి నుంచి సీనియర్ అసిస్టేంట్లతోనే పను లు వెళ్లదీస్తున్నారు. గత కొంత కాలంలో పూర్తి స్థాయి అధికారులను నియమించినప్పటి నుంచి వినియోగదారులకు అధి కారులకు మధ్య విబేదాలు పెడచూపడంతో ఆ శాఖలో అవి నీతి పెరిగిపోయింది. దీంతో డబ్బులు ఇవ్వనిదే ఏ పని జరగని పరిస్థితి నెలకొంది. ఒక్కో డాక్యుమెంటుకు 5 వేల నుం చి 10వేల వరకు అధికారులు వసూలు చేయడంతో ఇద్దరిలో ఒకరిని వి ని యోగదారులు అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టించారు. అప్ప టి నుంచి మరో జాయింట్-1 (సబ్ రిజిస్ట్రార్) కూడా సెలవు పెట్టి విధలకు ఎగనామం పెట్టి వెళ్లిపోయారు. అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుపడడంతో ఆస్థానం ఖాళీ అయింది. ఆ స్థానంను భర్తీ చేయడానికి హైదరాబాద్‌కు చెందిన ఓ అధికారిని నియమించారు. కాని ఆ అధికారి తన సొంత కారణాలతో వచ్చిన రెండు రోజులు విధులు నిర్వహించి సెలవు పెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటెంట్లుగా ఉన్న సిబ్బందితోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు.



నిజామాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

వివాదాలకు నిలయం

జిల్లా కేంద్రంలోని ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయం వివిధాలకు కేంద్ర బిందువు అయింది. గత రెండేళ్ల ఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తు న్న సిబ్బంది పలు వివాదాల్లో చిక్కుకోవడం వల్ల బదిలీల్లో భాగంగా ఇత ర జిల్లాల నుంచి పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్‌లను నియమించారు. వీరు తూతూ మంత్రంగా విధులు నిర్వహించి విధులకు సెలవులు పెట్టి వెళ్లిపోయారు. ఇక్కడ విధులు నిర్వహించడానికి పూర్తి స్థాయి అధికారులు రాకపోవడంతో ఎవరిని నియమించాల అనే ఆలోచనలలో ఉన్నతాధికారులు పడ్డారు. ఎవరిని నియమించిన ఎవరు సక్రమంగా విధలు నిర్వహించలేకపోతున్నారు. దీంతో ఉన్నతాధికారులు సీనియర్ అసిస్టెంట్లతోనే పనులు చేయిస్తున్నప్పటికీ వివాదాలను పూర్తిగా నివారించలేకపోతున్నారు.

పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్ లేక ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లా కేంద్రంలోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్లు విధులు నిర్వహిస్తుంటారు. కాని మూడు వారాలుగా పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్లు లేక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుంది. డాక్యుమెంట్లు ఆశించిన మేర కాక పోవడంతో ఆ శాఖ ద్వారా సమకూరే ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడుతుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌కు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో ఈ ఏడాది వార్షిక నెల రాకముందే సుమారు రూ.200కోట్ల మేర ఆదాయం రాకుండా పోయింది.

నత్తనడకన రిజిస్ట్రేషన్లు

మూడు వారాలుగా పూర్తిస్థాయి సబ్‌రిజిస్ట్రార్లు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తి స్థాయి సబ్ రిజిస్ట్రార్లు లేక పోవడంతో సీనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు 50కు పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరగాల్సిన చోట 20నుంచి 30 వరకు డాక్యుమెంట్లు అవుతున్నాయి. కొత్తగా సబ్ రిజిస్ట్రార్ విధుల్లో రావడంతో వారికి పైనిపై అవగాహన లేకపోవడంతో వారు రిజిస్ట్రేషన్లు ఆచితూచి చేస్తున్నారు. పైగా వినియోగదారుల తాకిడిని తట్టుకోలేక తమపై ఆరోగ్య సమస్యలు ఎక్కడ వస్తాయోనన్న ఆందోళనలో భయపడుతూ పనులు చేస్తున్నారు.

మధ్యలో ఆగిన గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు

● బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్ ● చోద్యం చూస్తున్న ప్రభుత్వం

రామారెడ్డి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో గంగమ్మ వాగు బ్రిడ్జి పనులు మూడు కోట్ల రూపాయలతో ప్రభుత్వం పనులు చేపిస్తుంది. రామారెడ్డి - కామారెడ్డి రోడ్డు బ్రిడ్జి రోడ్డులో ఉన్న బ్రిడ్జి పనులు ఆగిపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. గతంలో వర్షాలు పడడంతో పక్కనే ఉన్న చిన్న రోడ్డు తగ్గిపోవడంతో చాలా అవస్థలు పడ్డారు. వాహనదారులు మూడు లక్షల రూపాయలు నిధులతో ప్రారంభించినప్పటికీ ఇంతవరకు డబ్బులు చెల్లించక పోవడంపై కాంట్రాక్టర్ పరారయ్యారు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వస్తుంది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూర్తి విరాశం తెలుసుకుని హైదరాబాద్ పెద్ద అధికారులకు, ప్రజాప్రతినిధులకు పంపారు. వాహనాలు రాకపోకలు తీవ్ర ఇబ్బందితో ఉండడం వల్ల పక్కన రోడ్డు చిన్న రోడ్డు కావడంతో రెండుసార్లు వాహనాలు పలిటికొట్టాయి. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి నిజా మాబాద్ - భీంగల్‌తో పాటు రామారెడ్డి సిరికొండ తదితర మండలాలకు బయలు దేరుతాయి. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయానికి వాహనాలపై ఆలయానికి చేరుకుంటారు. కొందరు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని అధికారులకు లేకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపిస్తున్నారు. ఏదేమైనప్పటికీ పరిస్థితి చక్కదిద్దే బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానిదేనని ప్రజలు కోరుతున్నారు. కాగా దగ్గరలో ఉన్న కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో పెద్ద రోడ్డుపై బ్రిడ్జి పనులు కొనసాగినప్పటికీ ఇంతవరకు ఒక బిల్లు కూడా రాలేదని కాంట్రాక్టర్ గూడెం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు ప్రభుత్వం పట్టించుకోని పనులు పూర్తి త్వరలో చేసే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయిన దృశ్యం



పక్క నుంచి అదనపు రోడ్డు ఏర్పాటు చేయడంతో అధిక లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడ్డ దృశ్యం

అల్లాహ్‌కు చేరువ చేసే.. ఏతెకాఫ్

● ఆచరణతో హజ్‌యాత్రల పుణ్యఫలం ● రంజాన్ మాసంలో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే ఆరాధన



నందిపేటలో విద్యుత్ కాంతులతో ఉన్న మసీదు

నందిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఉపవాసం, తరావీహ్, నమాజ్, ఫిత్రా దానం తర్వాత అత్యంత కీలకమైంది ఏతెకాఫ్. దీని అర్థం 'ఒకచోట ఆగడం.. నిలబడడం' అని. 'కొంత కాలం పాటు ప్ర పంచ వ్యవహారాలు, కార్యకలాపాలకు దూరంగా ఉంటూ.. దైవానికి దగ్గర కావటం' అనే మరో అర్థం కూడా ఉంది. ఏదైనా మసీదులో ఏకాగ్రతతో కూర్చొని ఏతెకాఫ్ చేయాల్సి ఉంటుంది. దీన్ని పాటించే సమయంరానే వచ్చింది.

ఊరిలో ఒక్కరు ఆచరించినా..

రంజాన్ చివరి పది రోజుల పాటు ఏతెకాఫ్ పాటించే వారికి రెండు సార్లు హాజ్ యాత్ర, రెండు సార్లు ఉమ్రా చేసిన ఆరాధన ఫలం దక్కుతుంది. ఒక ఊరిలోని మసీదు పరిధిలో ఒక్కరు ఏతెకాఫ్ ఆచరించినా.. అక్కడుండే అందరి ఏతెకాఫ్ ఆచరణ బాధ్యత నెరవేరినట్లు అవుతుంది. పేద వారు ఆర్థిక ఇబ్బందులతో హజ్, ఉమ్రా చేయలేరు. అందు కనే ఏతెకాఫ్ ద్వారా ఆ ఆరాధనా ఫలాన్ని సొంతం చేసుకోవచ్చు. ఏతెకాఫ్‌లో భాగంగా మసీదులో ఉండేవారు రాత్రిళ్లు ఇతోధి కంగా జాగరణ చేసి అల్లాహ్ స్మరణలో, నమాజ్‌లో, ఖురాన్ పఠనంలో గడపాలి.



నందిపేటలో ఇంట్లో ప్రార్థన చేస్తున్న చిన్నారి

ఏతెకాఫ్ పద్ధతి ఇదీ..

ఏతెకాఫ్ ఎన్ని రోజుల పాటు ఉండాలనేది వ్యక్తిగతంగా సంకల్పించుకోవాలి. మసీదులో ఒక మూలకు పరదా కట్టుకొని అందులో ఉండాలి. పరదా ఉంటే పడుకోవడానికి, లేవడానికి అనువుగా ఉంటుంది. నమాజ్ సమయంలో పరదా ఎత్తివేయాలి. ఉపవాసం లేకుండా ఏతెకాఫ్ విధి నెరవేరదు. సహరీ, ఇఫ్తార్ భోజన పానీయాలు ఇంటి నుంచి తెప్పించుకోవాలి. అతి క్లిష్టమైన పరిస్థితులలో తప్పా, ఏతెకాఫ్ పాటతించే వారు మసీదు నుంచి బయటకు వెళ్లకూడదు. కేవలం మల మూత్ర విసర్జనకు, అజాన్ ఇచ్చే స్థలం వరకు వెళ్లాలి. షవ్వాల్ మాసం నెల వంక కనిపించాక ఏతెకాఫ్ నుంచి బయటకు వచ్చి నేరుగా ఇంటికి చేరుకోవాలి. మరుసటి ఉదయం పండుగ నమాజ్‌లో పాల్గొనాలి

ఆ రహదారిపై వెళ్లాలంటేనే భయం భయం!

● రోడ్డు ప్రమాదాల్లో పోతున్న ప్రాణాలు

ఇందల్వాయి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి యేటా రోడ్డు ప్రమాదంలో ఎన్నో ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఓ పక్క మూల మలుపు, మరో పక్క కంకర తేలి రోడ్డు గుంతలమయంగా మారిన రోడ్డుతో ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. గుంతలను పూడ్చాలని గ్రామస్థులు పలుసార్లు అధికారులను వేడుకున్న పట్టించుకునేవారే లేకుండాపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ రోడ్డువైపు నుంచి వెళ్తున్న వాహనదారులు భయం గుప్పిట్లో పెట్టుకొని వెళ్తున్నారు. మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి గ్రామ శివారులో పెద్దమ్మ గుడి దగ్గర ధర్పల్లి వెళ్లే దారిలో పెద్ద మూలమలుపు ఉంది. ఆ రోడ్డు వెంబడి ఇందల్వాయి, ఎల్లారెడ్డిపల్లి, గౌరారం, లింగాపూర్, ఆయా గ్రామాల ప్రజలు ధర్పల్లి వెళ్లాలంటే అన్సాన్‌పల్లి మీదుగా వెళ్లాల్సిందే. అన్సాన్‌పల్లి గ్రామంలో మూల మలుపు ఉండటం మూలమలుపు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలుపడి కంకర తేలడంతో ప్రతియేటా ఎన్నో ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. వర్షాకాలం వరద ఉధృతికి రోడ్డు కొట్టుకుపోవడంతో తక్కువ ఎత్తులో రోడ్డు ఉండటం కంకర తేలి గుంతలు పడటంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.


తరచూ రోడ్డు ప్రమాదాలు

గత ఏడాది నల్లవెల్లి గ్రామానికి చెందిన గంగాదాసు ద్విచక్ర వాహనంపై ధర్పల్లి వెళ్తుండగా అన్సాన్‌పల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొట్టడంతో గంగాదాస్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి సైతం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు సంవత్సరాల క్రితం అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన తెనుగు స్వప్న నిండు గర్భిణీ ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో అదే స్థలంలో ఆటో ప్రమాదంలో మృతి చెందింది. ఎనిమిది నెలల క్రితం కలిగోట్ గ్రామానికి చెందిన రాజేశ్వర్ ఇందల్వాయి నుంచి ధర్పల్లికి బైక్‌పై వెళ్తుండగా అన్సాన్‌పల్లి మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని గుంతలో పడి మృతి చెందాడు. వాడి గ్రామానికి చెందిన సునీల్ తన బైక్‌పై వెళ్తుండగా అదే స్థలంలో పడి మృత్యువాత పడ్డాడు. నెల క్రితం దగ్గి గ్రా మానికి చెందిన కొందరు వేములవాడ వెళ్తున్న క్రమంలో అన్సాన్‌పల్లి పెద్దమ్మగుడి వద్ద వేగంగా వస్తున్న కారుపై బైక్ ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా కారు పాక్షికంగా దెబ్బతింది. ఇలా ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్ బీ అధికారులు స్పందించి అన్సాన్‌పల్లి పెద్దమ్మ గుడి మూలమలుపు వద్ద రోడ్డుపై గుంతలు పూడ్చి సూచిక బోర్డు ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అన్సాన్‌పల్లి వద్ద అస్తవ్యస్తంగా మారిన రహదారి

రోడ్డును బాగు చేయాలి



వాసు, అన్సాన్‌పల్లి గ్రామస్థుడు

అన్సాన్‌పల్లి వద్ద రోడ్డు మూలమలుపు వద్ద ఎంతో మంది మృత్యువాత పడ్డారు. రోడ్డుపై కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నా.

రాత్రిపూట వెళ్లాలంటేనే భయం



భోజన్న, గ్రామస్థుడు

రాత్రిపూల రోడ్డు వెంబడి వెళ్లాలంటేనే భయం వేస్తుంది. పెద్ద మూల మలుపు, మరోపక్క రోడ్డుపై గుంతలు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.



లింగంపేట్‌లో మెట్లబావిని వీక్షిస్తున్న విద్యార్థులు..

మెట్ల బావిని సందర్శించిన విద్యార్థులు

లింగంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాచీన చారిత్రక నాగన్న (మెట్ల)బావిని గురువారం చిన్నమల్లారెడ్డికి చెందిన జిల్లా పరిషత్తు ఉన్నాత పాఠశాలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. బావి అందాలను, కట్టడాన్ని చూసి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆశ్చర్యపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి విద్యార్థులకు ప్రాచీన కట్టడాల ప్రాముఖ్యతను, భారత దేశ సంస్కృతిని వివరించారు.

లింబూర్‌లో తాగునీటి సమస్య

● మిషన్ భగీరథ నీళ్లే ఆధారం ● పట్టించుకోని అధికారులు

మద్నూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల గ్రామాల్లో నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. పట్టించుకునే వారే కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులో ఎస్సీ కాలనీల గురించి అధికారులు అసలే పట్టించుకోవడం లేదని ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. డోంగ్లి మండలంలోని లింబూర్ గ్రామంలో ఊ రుకు పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అక్కడి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ వాడలో గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ కనెక్షన్ ఉందని అక్కడ ఒకే దగ్గర నీటి కుళాయి ఏర్పాటు చేయడంతో కాలంలోని ప్రజలు ఆ కుళాయి వద్దకు నీళ్లను పట్టుకోవాల్సి వస్తుందని, వారంలో ఒకటి రెండుసార్లు మాత్రమే మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని మిగతా సమయంలో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో లింబూర్ గ్రామంలోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. మిషన్ భగీరథ నీళ్లలో కూడా నాచు, మురికి నీళ్లు రావడంతో తాగడానికి ఇబ్బందులు పడుతున్నామని తాగునీటి కోసం లింబూర్ గ్రామంలోకి వెళ్లి బోరు నీటిని తీసుకొచ్చు కుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని గ్రామాలలో మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ వారంలో ఒకటి రెండు సార్లు మాత్రమే మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని మహిళలు తెలిపారు. తమ ఎస్సీ కాలనీలో ఒకే వద్ద నీటి కుళాయి ఏర్పాటు చేయడం వారంలో ఒకటి రెండుసార్లు మాత్రమే నీళ్లు రావడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు స్పందించి ఎస్సీ వాడలో నీటి సమస్య తీర్చాలని మహిళలు, కాలనీవాసులు కోరుతున్నారు.

లింబూర్ ఎస్సీ వాడ ఇదే..






కాలనీలో ఉన్న ఒకే ఒక్క కుళాయి

● **నీళ్లలో నాచు, మురికి వస్తుంది సారూ**



మిషన్ భగీరథ నీళ్ళలో నాచు, మురికి నీళ్లు వస్తున్నాయని తాగడానికి వాడటం లేదని తాగే నీటి కోసం లింబూర్ గ్రామంలోకి వెళ్లి నీళ్లను తెచ్చుకుంటు న్నామని ఎస్సీ కానీలో బోరు వేయించాలని కోరారు. - లక్ష్మీ, ఎస్సీ కాలనీ వాసి

● **ఎస్సీ కాలనీలో నీటి సమస్య**



లింబూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతుందని ఉన్న ఒకే మిషన్ భగీరథ కుళాయి వద్ద నీళ్ళను పట్టుకుంటున్నామని అవి కూడా సక్రమంగా రావడం లేదని గ్రామంలోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా కాలనీలో నీటి సమస్య తీర్చాలని కోరారు. - కరుణ, గ్రామస్థురాలు

జుక్కల్ ఎమ్మెల్యేను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

మద్నూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చి కృషి చేస్తున్నందుకు మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం హైదరాబాద్ వెళ్లి ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మద్నూర్ మండల కేంద్రానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని, అదే విధంగా మూడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి 70 కోట్లు మంజూరు చేస్తున్నట్లు శాసన సభలో కొండ సురేఖ ప్రకటించడంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామ్ పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు సాయిలు, సీనియర్ నాయకులు హన్మాండ్లు, స్వామి, అమూల్, కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని ఏకగ్రీవ తీర్మానం



వార్షిక నివేదిక చదువుతున్న సీవో సందీప్

పెద్ద కొడప్‌గల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండల సహకార సంఘం పరిధిలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జరిగిన మహాజన సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. సహకార సంఘ ఆవరణలో అధ్యక్షులు హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహాజన జరగగా పలు అంశాలపై సభ ఏకగ్రీవ తీర్మానం చేశారు. రబీ సీజన్ కు గాను మండల రైతులు ఆరుతడి పంట కింద వేసిన జొన్న కొనుగోలు కేంద్రం తొందరగా ప్రారంభించాలని తీర్మానం చేశారు. అంతేగాక జొన్నలు గతంలో ఎకరాకు 9 క్వింటాళ్ల పరిమితి ఉండగా, దీనిని 25 క్వింటాళ్ల వరకు పెంచాలని తీర్మానించారు. దీంతో పాటుగానే సహకార సంఘ సభ్యులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని రుణమాఫీ చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నాగిరెడ్డి, హన్మయ్య, సాయవ్వ, సహకారసంఘ సిబ్బంది సంజీవ్, శంకర్ నర్సింలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యా యత్నం



బాన్సువాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్

నసురుల్లాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల వేధింపులు తాళ లేక అంగన్‌వాడీ టీచర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసు కున్న సంఘటన నసురుల్లాబాద్ మండలంలోని బొమ్మన్ దేవ్ పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మూడవ నెంబర్ అంగన్‌వాడీ టీచర్ సువర్ణ తెలిపిన వివరాల ప్రకారం మండల సూపర్ వైజర్ పదేపదే తన అంగన్‌వాడీ సెంటర్ కు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తుందని, అంగన్వాడి సెంట ర్‌కి చిన్నారులు రాకపోవడంతో, వాళ్ళ ఇంటికి వెళ్లి సెంటర్‌కి తీసుకురావాలని ఆదేశించడంతో తాను మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం జరిగిందన్నారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన అంగన్‌వాడీ టీచర్‌కి హుటాహుటిన బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

కూలీకి వచ్చి యజమాని ఇంట్లో చోరీ

● దొంగను పట్టుకుని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

లింగంపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన ఎట్టం సిద్దయ్య నూతన గృహ నిర్మాణాన్ని చేపట్టాడు. ఇంటి నిర్మాణానికి కన్నాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ కూలీపనికి వచ్చి అదే రోజు రాత్రి ఇంట్లో చోరికి పాల్పడ్డడని ఎల్లారెడ్డి సీఐరవీందర్ నాయక్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దయ్య ఇంటి నిర్మాణానికి కూలికి వచ్చిన మండలంలోని కన్నాపూర్‌కు చెందిన శ్రీకాంత్ ఈనెల 19న ఇంట్లోకి చొరబడి ఇంట్లోని రూ.2లక్షల 30వేల నగదు, రెండు జతల పట్టీలు, ఒక సెల్‌ఫోన్, బైక్ చోరి చేసి నట్లు బా ధితుడు సిద్దయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. గురువారం మధ్యాహ్నం కామారెడ్డి ఎల్లారెడ్డి రహదారిపై పొల్కంపేట చౌరాస్తావద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి శ్రీకాంత్ పారిపోతుండగా పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అతని వద్ద నుంచి 17వేల నగదు, ఒక జత పట్టీలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐతెలియ జేశారు. శ్రీకాంత్‌పై రాచకొండ, కీసర, సంగారెడ్డి, అల్లాదుర్గం, లింగంపేట, రామాయంపేట, సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లలో క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. వారం రోజుల వ్యవదిలో దొంగను పట్టుకున్న ఏఎస్సై ప్రకాశ్‌నాయక్‌ను సీఐ అభినందించారు.

జమిలి ఎన్నికలతో దేశానికి ఆర్థిక భారం తగ్గుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బాన్సువాడటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలతో దేశానికి ఆర్థిక భారం తగ్గుతోందని అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. దేశంలో ఒకే సారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆర్థికంగా డబ్బు ఆదా అవుతుందన్నారు. అంతేకాకుండా సమయం కూడా వృధా కాకుండా ఉంటుందని, సమయానుసారంగా పనులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి , మండలాధ్యక్షుడు మజ్జిగ శ్రీనివాస్,దత్తు, సంతు పటేల్, సాయిరెడ్డి, శివకుమార్ తదితరులున్నారు.

● 'ఒకే దేశం..ఒకే ఎన్నికపై' అవగాహన

తాడ్వాయి:మండల పార్టీ కార్యాలయంలో ఒకే దేశం - ఒకే ఎన్నిక అంశంపైన బీజేపీ దృష్టి కోణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా జిల్లా మాజీ అధ్య క్షు డు మహారాజుల మురళి హాజరై మాట్లాడారు. దేశం ఒకే ఎన్నికపై కార్య కర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాడ్వాయి మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌రావు, హోటల్ శ్రీను, ఉపాధ్యక్షుడు నర్సారెడ్డి, రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దత్తాత్రేయ, బూత్ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మద్నూర్: భారతీయ జనతా పార్టీ మద్నూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గురువారం 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' పేరిట సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు తుకారాం మా ట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' పేరిట ఎన్నికలు నిర్వహించ డానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎన్నికల్లో ఖర్చులు తగ్గుతాయని గుర్తు చేశారు. ఈ కార్య క్రమానికి మద్దతుగా బీజేపీ ఆధ్వ ర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మండల ఇన్‌చార్జి మల్లికా ర్జున దేశా య్, మాజీ సొసైటీ చైర్మన్ పండితరావు పటేల్, బీజేపీ నాయ కులు యాదవ్‌రావ్, తులావర్ సంతోష్, శ్రీపాద పటేల్, రాచుర్ సుభాష్, రాజు దేశాయ్, కిరణ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్:ఒకేదేశం ఒకే ఎన్నిక విధానానికి పార్టీలకతీతంగా ప్రజలందరూ మద్దతు పలకాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామ్‌రెడ్డి తెలిపారు. గురువారం సదాశివనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో వన్ నేషన్- వన్ ఎలక్షన్ వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకేదేశంలో ఒకే ఎన్నికలు జరగడం ద్వారా అభివృద్ధికి ఆటంకం కల్గకుండా ఉంటుందన్నారు. ఆర్థిక వ్యవస్థ ఎన్నికల నిర్వహణఖర్చు భారం కాకుం డా ప్రభుత్వాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా ఉపాధ్యాక్షుడు విఠల్, నాయకులు చక్రధర్‌గౌడ్, సాయిలు, హారిక, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రేషన్‌కార్డుదారులను గుర్తించాలి

రాజంపేట,మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాల యంలో గురువారం రేషన్‌కార్డుల పరిశీలన విషయంపై పంచాయతీ కార్యదర్శులతో తహసీ ల్దార్ సతీష్‌రెడ్డి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా లలో రేషన్ కార్డులకు దరఖాస్తుచేసుకున్న వారి వివరాలు సేకరించి అర్హులను గుర్తించే విధంగాచూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే రెమ్యునరేషన్ అందించాలి

కామారెడ్డిటౌన్,మార్చి 27(ఆంధ్రజ్యోతి):సమగ్ర కుటుంబసర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ అందించాలని కోరుతూ సీపీఓ రాజారాంను తపాస్ నాయకులు కలిశారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం పూర్తయిన సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన రెమ్యూనరేషన్ అందించలేదని అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక రకాలైన బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రం, లక్ష్మీపతి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలు సమర్థవంతంగా నిర్వహించాలి

సదాశివనగర్,మార్చి 27(ఆంధ్రజ్యోతి):మహిళ సంఘాలు కొనుగోలు కేంద్రాలనుసమర్థవంతంగా నిర్వహించాలని ఏపీఎంరాజారెడ్డి తెలిపారు. మండల మహిళసమైఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మారావు పేట, అమర్లబండ, కుప్రియల్ గ్రామాలకు ఐకేపీ ద్వారాకొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని సూచనలు చేశారు.సంఘాల పనితీరు మెరుగు పరుచుకోవాలని రికవరీ పొదుపులు సక్రమంగా చూసుకోవాలని వచ్చే నెలలో గ్రామసంఘాల యొక్క ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామసంఘాల అధ్యక్షుడు, సీసీలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లపై దరఖాస్తుల ఆహ్వానం

● మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ

రామారెడ్డి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు ఈనెల 31వ తేది వరకు వ్యవసాయ రంగం వస్తువులకు తక్కువ రేటుకు అవసరం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని రామారెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారి భానుశ్రీ గురువారం పేర్కొన్నారు.సబ్సిడీపై వ్యవసాయ రంగంకు చెందిన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు ఈఅవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ పట్టా పాస్ బుక్ జిరాక్స్ పాస్ పోర్టు సైజు ఫోటో ట్రాక్టర్ పరికరాల కోసం డాక్టర్ ఆర్‌సీ తదితర వాసుల కోసం దరఖాస్తులు స్వీక రిస్తున్నామని సంబంధిత ఏఈవోలకు అందజేయాలని ఆమె వివరించారు.

హనుమాన్ సామూహిక మండల పడిపూజ

బిచ్కుంద,మార్చి 27(ఆంధ్రజ్యోతి):హనుమాన్ స్వాముల సామూహిక మండల మహా పడి పూజ కార్యక్రమాన్ని ఈనెల 29న నిర్వహించనున్నట్లు గురుస్వామి నూకల హనుమాన్లు తెలిపారు. సామూహిక మండల హనుమాన్ మహాపడిపూజ కార్యక్రమాన్ని బాన్సువాడ,జుక్కల్, బోధన్,ఎల్లారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి హనుమాన్ స్వాములు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలను పరిశీలించిన ఎంపీడీవో



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామారెడ్డి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వ యంతో గ్రామాల్లోమొక్కలను పెంచుతున్న తీరును గురువారం రామారెడ్డి ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలను మంచిగా పెంచాలని ఉపాధి పనుల్లో భాగంగా అవసరమైన చోట్ల మొక్కలను పెంచాలని కోరారు.ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా మొక్కలను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సహకరిస్తున్న తీరును ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకుని ముందుండాలన్నారు. అనం తరం పలుసలహాలు, సూచనలు,పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమం లో రామారెడ్డి పంచాయితీ కార్యదర్శి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఆవరణలో ఇసుక వేలం

● మూడు ట్రాక్టర్లకు రూ.5,100 ఆదాయం

నిజాంసాగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం పాటలు జరిపారు. ఇటీవల మరిపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకుని ట్రాక్టర్లను సీజ్ చేసి ఇసుకను స్వాధీనం చేసుకుని, దీంతో రెవెన్యూ అధికారులు పోలీసుల ఆవరణలో ఉన్న మూడు ట్రాక్టర్లు ఇసుకను ఐదు వేల ఒక వంద రూపాయల వేలం వేశారు. దీంతో వాటా యాక్ట్‌కు రూ.5,100 ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఈ వేలం పాటలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబాతో పాటు పోలీసులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామారెడ్డి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం బట్టు తండా గ్రామంలో గంగావత్ శివ ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించాడు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని గురువారం మాజీ జడ్పీటీసీ నారారెడ్డి మోహన్‌రెడ్డి పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి రెండు వేల రూపాయలు, 50 కేజీల బియ్యాన్ని సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బట్టు తండా గ్రామ మాజీసర్పంచ్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి నాయక్, ఎస్టీ సెల్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ లచ్చిరాంనాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజునాయక్, నాయకులు శంకర్ నాయక్, రామచంద్ర నాయక్, కన్నాపూర్ మాజీ సర్పంచ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

గాంధారి,మార్చి 27(ఆంధ్రజ్యోతి):గాంధారి మండలంలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుదాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని జెమినితండాలో 10 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ధరవత్ హనుమండ్లును అరెస్ట్‌చేశారు. అనంతరం రెండు లీటర్ల నాటు సారానుసీజ్‌చేసిబెల్లం పాన్కమ్‌ను ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైన గంజాయి పండించిన,విక్రయించిన చట్టపరమైనచర్యలు తీసుకుంటామని తెలిపారు. నాటుసారాను ఎవరు తయారుచేసిన తమకు సమాచారం అందించాలని తెలిపారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల పంపిణీ

ఎల్లారెడ్డి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన నర్ల రాజు అఖిల దంపతుల వారి బాలుని పుట్టినరోజు సందర్భంగా గురువారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని గ్రామానికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్ర పహాడ్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

తాడ్వాయి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎర్ర పహాడ్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఏనుగు మో హన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలి పారు. ఉపాధ్యక్షుడిగా భీమాగోనోళ్ల నర్సాగౌడ్, గాదెల బాలయ్య, జనరల్ సెక్ర టరీ గైనిరాజలింగం,క్యాషియర్‌గా మైలారం రాజయ్య, సలహాదారులుగా బద్దం సాయిరెడ్డి, బొక్క రాజిరెడ్డి, ఏనుగు నడిపి బాల్‌రెడ్డి, కొం పల రాము లు, బోడోళ్ల గంగారాం, దేవిరెడ్డి జెలేందర్‌రెడ్డి, తమ్మల సాధశివుడు ఎన్ను కున్నారు. తమను గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు గ్రామసంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

సహకార రంగాన్ని పరిరక్షిస్తూ రైతులకు ప్రయోజనం కలిగేలా కృషిచేద్దాం

సదాశివనగర్,మార్చి 27(ఆంధ్రజ్యోతి):సహకారరంగాన్ని పరిరక్షిస్తు రైతులకు ప్రయోజనం కలిగేలా సహకార సంఘాన్ని ముందుకు తీసుకెళ్దామని చైర్మన్ మర్రిసదాశివరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం కార్యవర్గసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలను 50శాతం ఐకేపీకు కేటాయించే ప్రభుత్వ నిర్ణయాన్ని పునపరిశీలించాలని దీనిపై ప్రభుత్వానికి లేఖరాయాలని తీర్మానించారు. దీనిని ప్రభుత్వం పునసమీక్షించకపోతే భవిష్యత్తులో సహకార సంఘాలు కొనసాగడం కష్టమవుతుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు అందించే సేవలలో కీలకపాత్ర పోషిస్తుందని దీని ప్రాముఖ్యత తగ్గిపోతే రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కుప్రియల్‌లో కొత్తగోదాములను నిర్మించడం అత్యవసరమని సమావేశంలో అభిప్రాయపడుతూ నిల్వ సామర్థ్యాన్ని పెంచేం దుకు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు పంపిణీని సజావుగా నిర్వహించేం దుకు దీనిని తక్షణమే అమలుచేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్‌పశుపతి, మానిట రింగ్ ఆఫీసర్ సాయిలు, సీఈవో భైరయ్య, డైరెక్టర్‌లు లక్ష్మాగౌడ్, భాస్కర్, నారాయణరెడ్డి, సిబ్బంది తెలిపారు.

సెర్ప్‌లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్,అధికారులు

కామారెడ్డిటౌన్,మార్చి 27(ఆంధ్రజ్యోతి): సెర్ప్‌లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ అన్నారు. గురువారం సెర్ప్‌కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఆయన మాట్లాడుతూ.. యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని సీఎం నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్‌నుంచి 50శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారుచేయాలని అన్నారు.జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆకేంద్రాలను ఐకేపీలకు బదిలీ చేయాలని, అదనపు వరిధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళ సంఘాలచే ప్రారంభించాలని తెలిపారు. నూతనంగా ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల మహిళ సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పా టు చేసినందుకు పౌరసరాఫరాలశాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళ సంఘాలకు అందడంలేదని దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్‌లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమిషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని,గన్ని బ్యాగులు రికన్సిలేషన్ ప్రక్రియచేపట్టాలని తెలిపారు. స్వశక్తి మహిళ సంఘాలచే రైస్ మిల్లులుఏర్పాటు ప్రణాళికలు తయారుచేయాలని అన్నారు. పౌరసరాఫరాలశాఖ,సెర్ప్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరాఫరాచేసే దిశగా కార్యచరణ తయారుచేసుకోవాలని తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో 27 కొనుగోలు కేంద్రాలు ఉండగా ప్రస్తుతం మరో 156 కేంద్రాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు పెంచడం జరుగుతుందని తెలిపారు. ఆయాకొనుగోలు కేంద్రాలకు కావాల్సిన ఎక్విప్మెంట్ సమకూర్చాలని తెలిపారు.పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు అనువైనభూములను గుర్తించాలని రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టుటకు మాచింగ్‌బ్యాచింగ్ చేయాలని తెలిపారు. సదరం క్యాంపుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్‌డీఓ సురేందర్, ఎల్‌డీఎం రవికాంత్, జిల్లా సహకార అధికారి రామ్‌మోహన్, పౌరసరాఫరాలసంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్,డీసీఓ మల్లికార్జున్‌బాబు, మెప్మాపీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బరంగేడ్గిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

బీర్కూర్,మార్చి27(ఆంధ్రజ్యోతి):మండలం బరంగేడ్గి గ్రామంలో గురువా రం కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.పనులలో నాణ్యత ప్రమాణాలతో చేపట్టి త్వరిత గతిన పూర్తి చేయాలని కోరారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని బాబల్‌గాం గ్రామంలో గురువా రం ఉపాధిహామీ నిధులతో కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులు ప్రారంభిం చారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీనిధులు రూ.10 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని పనులు చేసే కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు శ్యామప్ప, పండరి, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి:ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సహకారంతో మండల కేంద్రం,గ్రామాల్లో, తండాల్లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ మండల నాయ కులు శంకర్ నాయక్ తెలిపారు. రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ వద్ద ఐదు లక్షల వ్యయంతో ఎమ్మెల్యే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. గోకుల్ తండా గ్రామ పంచాయితీలో రూ.20 లక్షల ఎన్‌ఆర్ ఈజీ ఎస్ నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల నాయ కుడు మోహన్‌నాయక్ తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, విండో వైస్ చైర్మెన్ అమ్ముల పశుపతి చారి, ఎంసి డైరెక్టర్ ఎండి రావుఫ్, మండల మహిళా అధ్యక్షురాలు అంజవ్వ, పాల్గొన్నారు.

టీజీఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్,మార్చి 27(ఆంధ్రజ్యోతి):టీజీఆర్‌జేసీ సెట్ 2025 ప్రవేశాల కోసం పదోతరగతి బాల బాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చని మద్నూర్ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగా కిషోర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు గాను ప్రవేశ అర్హత పరీక్ష కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలి పారు. ఇందు కోసం http:tgrjc.cgg.gov.in ఆన్‌లైన్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవ చ్చని చెప్పారు. రూ.200 దరఖాస్తు రుసుముతో 24 మార్చి 2025 నుంచి 23 ఏప్రిల్ 2025 వరకు ఈ అవకాశం ఉంటుందని, ప్రవేశ పరీక్ష ప్రతిభ, రిజ ర్వేషన్ ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష మే 10వ తేదీకి ఉంటుందని, వివరాలకు ఫోన్ నెంబర్లు 040-24734899 లో సంప్రదించవచ్చునని చెప్పారు.

వడ్డీవ్యాపారులపై కేసు నమోదు

బిచ్కుంద,మార్చి 27(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులపై గురువారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలి పారు.అత్యవసర పరిస్థితులలో ప్రాంసరి నోటు రాయించు కోవడం, వ్యవసాయభూముల పత్రాలను తాకటు పెట్టుకునే డబ్బులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అ.ధిక వడ్డికి అప్పులు ఇచ్చే మండల కేంద్రానికి చెందిన శ్రీరాం,వీరుకుమార్,పడిగల లక్ష్మన్, అశో క్ ఇండ్లలో తనిఖీలు చేపట్టి వారి వద్దనుండి బాధితుల ప్రాంసరి నోట్లు,తాకట్టు పెట్టిన వ్యవ సాయభూమి పత్రాలు స్వాధీన పరుచుకుని ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట,మార్చి 27(ఆంధ్రజ్యోతి):రాజంపేట కేజీబీవీలో గురువారం పోలీసుకళాబృందం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఒకవేళ సెల్‌ఫోన్ వినియోగించాల్సి వచ్చినఅనవసర లింక్‌లు ఓపెన్‌చేసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కవద్దని తెలిపారు. అత్యవసర సమయంలో 100,1930,181లకు సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతులకు కృషి : ఆర్‌ఎం



మద్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం

మద్నూర్,మార్చి27(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు మరమ్మ తులకు కృషి చేస్తానని నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జోత్స్న అన్నారు. శిథిలావస్థలో ఉన్న పెచ్చులూడిన మద్నూర్ ఆర్టీసీ బస్టాండ్‌ను గురువారం ఆమె పరిశీలించారు.ఈసందర్భంగా బాన్సువాడ డీఎం సరిత దేవితో మాట్లాడుతూ అధ్వాన్నంగా ఉన్నటు వంటి మద్నూర్ బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలని మరమ్మత్తులకు కావలసిన నిధులను మంజూరు చేయిస్తానని అన్నారు.మహారాష్ట్రకు సరిహద్దుల్లో ఉన్న మద్నూర్ మండల కేంద్రంలోని బస్టాండులో ప్రయాణీకులకు కావలసిన అన్ని సౌక ర్యాలు కల్పించాలనిసూచించారు.మండలంలో ఎన్నిగ్రామాలకు బస్సు సౌకర్యం, రోడ్డు సౌకర్యం ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిం చాలని ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.

మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ

రాజంపేట,మార్చి 27(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం టైలరింగ్,స్టిచింగ్,కటింగ్‌పైన మహిళ సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఏపీఎం తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో స్కూ ల్ విద్యార్థుల యూనిఫామ్ స్టిచింగ్ గురించి వివరించడం జరిగిందని సభ్యులు రాజంపేట, ఆర్గోండ గ్రామాల నుంచి శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. టైలరింగ్ శిక్షణ పద్మ, విజయలక్ష్మీ ఇచ్చారని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- ఫైర్
ప్రియా 70	- పెళ్లికాని ప్రసాద్
ప్రియా 35	- ఛావా

బాన్సువాడ	
మహేశ్వరి	- కోర్ట్
వెంకటేశ్వర	- షణ్ముఖ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

